సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం, 26, ఏప్రిల్, 2024

బడికి సెలవు..
ఆటలకు నెలవు

పాఠశాలలకు వేసవి సెలువులు ఇవ్వడంతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు మొదలయ్యాయి. బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, క్రికెట్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, కరాటే, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు, అనుభవజ్ఞులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తున్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు కోరారు. ఆసక్తిగల వారు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఇండోర్ స్టేడియం, లేదా డీఎస్‌డీఓను 9866317303, 9949110705 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

– హుడాకాంప్లెక్స్


బాస్కెట్‌బాల్‌లో శిక్షణ


క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు


స్కేటింగ్


వాలీబాల్ ఆడుతున్న బాలురు


కబడ్డీ ఆడుతున్న బాలికలు

న్యూస్‌రీల్

మలేరియాను తరిమికొడదాం
డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు


షాద్‌నగర్‌రూరల్: దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకొని మలేరియాను తరిమికొడదామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పట్టణ ముఖ్యకూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దోమలు కుట్టడంతో మలేరియా, డెంగ్యూ, మెదడువాపు, బోదవ్యాధి, చికున్‌గున్యావంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో నీటి పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మళ్లీ నింపుకోవాలని అన్నారు. నీటి గుంతలు, పాడుబడిన బావులను, లోతట్టు ప్రదేశాలను పూడి నీటి నిల్వ కాకుండా చూడాలన్నారు. చెత్తాచెదారాన్ని మురుగు కాల్వల్లో చేరకుండా, కంప చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఫాగింగ్ చేయాలని, ఇళ్లలో దోమతెరలు, దోమలను పారద్రోలే పరికరాలను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాకేష్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్: మేడే కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మొయినాబాద్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు భారీగా పెరిగి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి ప్రభాకర్, నాయకులు ఎండీ జలీల్, ఎండీ మక్బుల్, మంజుల, వెంకటయ్య, నరసింహులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం


మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. గురువారం పోలీసులు, ఎన్నికల బృందం అధికారులు, స్పెషల్ పోలీసు అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు రవాణ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీలో ఎస్‌ఎస్‌టీ ఎన్నికల టీం సభ్యుడు వినయ్, సమీర్, ఏఎస్ఐ బాల్‌రెడ్డి, కృష్ణయ్య, మంజు తదితరులు పాల్గొన్నారు.

64 మంది అభ్యర్థులు | 88 నామినేషన్లు

ముగిసిన నామినేషన్ల ఘట్టం
- చేవెళ్ల లోక్‌సభ స్థానానికి భారీగా పోటీ
- నేడు నామినేషన్ల పరిశీలన
- రేపటి నుంచి 29 వరకు ఉపసంహరణ
- 29న అభ్యర్థుల తుది జాబితా విడుదల
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఫలితాలు


బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన తనయుడు వీరేశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. ఆఖరి రోజు అభ్యర్థులు భారీగా నామినేషన్లు వేశారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి 64 మంది అభ్యర్థులు 88 నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి నాలుగో సెట్‌ను దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున ఆయన తనయుడు కాసాని వీరేశ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వంత్రులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. శనివారం నుంచి 29 వరకు ఉపసంహరణ కార్యక్రమం కొనసాగుతుంది. 29న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు. మే 13న ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. జూన్ 6తో ఎన్నికల ఘట్టం ముగియనుంది.

నాగర్ కర్నూల్ నుంచి బీజేపీ అభ్యర్థి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సుధాకర్‌రెడ్డి, జక్క రఘునందరెడ్డి ఉన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి


నాగర్‌కర్నూల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి భరత్

చక్రస్నానం.. నేత్రపర్వం


- ముగిసిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు
- చివరిరోజు ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు గురువారం చక్రస్నానంతో ముగిశాయి. స్వామివారికి సర్వసైన్యాధిపతి అయిన చక్రస్వామి ఆధ్వర్యంలో చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమగుండాల గదిలో పూర్ణాహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా పెట్టి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకీలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవపాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవ్వళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధ ద్రవ్యాలతో నవకలశ అభిషేకం నిర్వహించారు. తరువాత చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. సాయంత్రం ఆలయ అర్చకులు గరుడ పటాన్ని అవరోహణం చేసి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. ఉత్సవాలకు చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహన్, కిట్టు, కన్నయ్య, సురేశ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.


గండిపేట చెరువులో స్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

‘పవర్’ఫుల్ డిమాండ్

- రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం
- ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లు, ఫీడర్లు
- పీటీఆర్‌ల సామర్థ్యం పెంచే ప్రయత్నం
- సరఫరాలో అంతరాయం లేకుండా యంత్రాంగం చర్యలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అంతర్జాతీయ విమానాశ్రమం సహా ఔటర్ రింగ్ రోడ్డు ఇదే జిల్లాలో ఎక్కువ భాగం ఉంది. నగరానికి ఆనుకుని ఉండడంతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు గృహ సముదాయాలు భారీగా వెలుస్తున్నాయి. మరోవైపు తాజాగా ఎండలు దంచి కొడుతున్నాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతోంది. గత ఏడాదితో పోలిస్తే సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవుతోంది. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో ఆయా ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లు, ఫీడర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. తరచూ సాంకేతిక సమస్యలు వస్తుండడంతో ఇంజనీర్లు అప్రమత్తమయ్యారు. ఆయా సర్కిళ్ల పరిధిలో అత్యధిక విద్యుత్ డిమాండ్ ఉన్న ఫీడర్లను గుర్తించి, ఆ మేరకు వాటి సామర్థ్యం పెంపునకు చర్యలు చేపడుతున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆర్టిజన్ మొదలు డీఈ వరకు సబ్‌స్టేషన్‌లోనే ఉంటున్నారు. సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు.

డిమాండ్‌ను తట్టుకునేలా..

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని నందనవనం సబ్‌స్టేషన్ పరిధిలో 55 వేలకుపైగా కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ 8 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పీటీఆర్ మాత్రమే ఉంది. భారీగా విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తి అంతరాయం ఏర్పడుతోంది. వీటికి చెక్ పెట్టేందుకు ఇక్కడ అదనంగా రెండు 12.5 ఎంవీఏ పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. 30వేల వినియోగదారులు ఆధారపడి ఉన్న తుర్కయంజాల్ సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్ సామర్థ్యాన్ని ఐదు ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచారు. కొత్తగూడ సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్ సామర్థ్యం 8 ఎంవీఏ ఉండగా, ఇక్కడ అదనంగా మరో మూడు 12.5 ఎంవీఏ(అయ్యప్ప సొసైటీ, కొత్తగూడ, సెజ్) పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. వీటిని రెండురోజుల క్రితం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. అంతరాయానికి ఆస్కారం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

సర్కిళ్ల వారీగా డిమాండ్ ఇలా..

- సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో గత ఏడాది ఏప్రిల్ 20న అత్యధికంగా 455 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. తాజాగా అదే రోజు 683 మెగావాట్లు దాటింది.
- గత ఏడాదితో పోలిస్తే ఈసారి మూడు నుంచి నాలుగు మిలియన్ యూనిట్లు అధికంగా నమోదువుతోంది.
- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గత ఏడాది ఏప్రిల్ 19న అత్యధికంగా 600 మెగావాట్లు నమోదు కాగా, తాజాగా ఏప్రిల్ 5న 775 మెగావాట్లు వినియోగం అయింది.
- సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో గత ఏడాది ఏప్రిల్ 26న అత్యధికంగా 290 మెగావాట్లు నమోదు కాగా, తాజాగా 296 మెగావాట్లు రికార్డు అయింది.
- వికారాబాద్ సర్కిల్ పరిధిలో గత ఏడాది ఏప్రిల్ 5న అత్యధికంగా 264 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది ఇదే రోజు 281 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం.

రంగారెడ్డి జోన్‌లో విద్యుత్ డిమాండ్

తేదీ	2023		2024	
ఏప్రిల్	మెగావాట్లు	ఎంయూ	మెగావాట్లు	ఎంయూ
14	1,433	34.22	1,512	36.61
15	1,579	32.96	1,565	37.83
16	1,438	31.52	1,719	40.29
16	1,518	34.35	1,761	40.29
17	1,485	34.10	1,728	39.88
18	1,575	35.40	1,743	39.78
19	1,558	34.99	1,670	36.02
20	1,575	34.55	1,552	37.86
21	1,381	28.99	1,547	36.60
22	1,348	29.92	1,661	37.72

మోదీతోనే దేశం అభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక చొరవతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రపంచంలో అగ్ర దేశాలతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు. నాగారంలోని కుండె వెంకటేశ్ ఫామ్‌హౌస్‌లో గురువారం పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు సుధాకర్ శర్మ, బస్వ పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ తదితరులు పాల్గొన్నారు.

‘కొండా’ను గెలిపించండి

కందుకూరు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దెబ్బడగూడలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలతో సమావేశమై బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, జిల్లా నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, మంద పాండు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కళ్లెం సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కె.చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం: సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

హద్దు మీరి మాట్లాడుతున్నారు

- ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు
- కాంగ్రెస్‌పై ఎమ్మెల్యే సబితారెడ్డి ఫైర్
- చేవెళ్లలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

చేవెళ్ల: రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు హద్దు మీరి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని గురువారం ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ క్రిష్టారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కొంతమంది నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీల్లోకి వెళ్లినప్పటికీ క్షేత్రస్థాయిలో పార్టీ బలం ఎక్కడా తగ్గలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి కాసాని మాట్లాడుతూ.. చేవెళ్ల నుంచి తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన ఎలా ఉండేదో ఇప్పుడు పాలన ఎలా ఉందో ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎన్నికల ఇన్‌చార్జి గట్టు రాంచందర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు.. బాల్‌రాజ్, రాంరెడ్డి, ప్రభాకర్, యాదగిరి, శివప్రసాద్, రాముగౌడ్, చంద్రశేఖర్, వెంకటేశ్, శ్రీకాంత్, ఆంజనేయులు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పదివేల ఓట్ల తొలగింపు

- వృద్ధులు, దివ్యాంగులకు ఓట్ ఫ్రమ్ హోమ్ అవకాశం
- కొత్తగా 13,308 యువ ఓటర్ల నమోదు
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో పదివేల ఓట్లు తొలగించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. అందులో డబుల్ ఓటర్లతో పాటు మృతిచెందిన వారి ఓట్లు ఉన్నాయన్నారు. కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో మొత్తం 5,56,741 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 2,85,131, మహిళలు 27,1534, ఇతరులు 66 మంది ఉన్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా మే 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎన్నికల సిబ్బంది వారి వద్దకే వెళ్లి ఓట్లు వేయిస్తారన్నారు. ఈసారి 13,308 మంది యువ ఓటర్లు కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 511 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మరో 26 అదనంగా ఏర్పాటు చేస్తామని.. 9 పోలింగ్ స్టేషన్లను మార్చుతున్నామన్నారు. రానున్న వారం రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఓటింగ్ స్లిప్పులు పంపిణీ చేస్తామన్నారు. జల్‌పల్లి ప్రాంతంలో ఓటర్ల నమోదు విషయమై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నివేదిక సమర్పించామన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్

రూ.50వేలు దాటితే డబ్బు సీజ్..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వే బృందాల తనిఖీల్లో నియోజకవర్గ పరిధిలో రూ.1,13,85,000 విలువ గల డ్రగ్స్, రూ.4,33,526 విలువ గల 1400 లీటర్ల మద్యంతో పాటు రూ.35,37,500 నగదు పట్టుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు. రూ.50 వేల కంటె ఎక్కువ నగదు, రూ.10వేల కంటే ఎక్కువ విలువ గల బహుమతులు తరలిస్తే అధికారులు సీజ్ చేస్తారన్నారు. ఇళ్లల్లోకి వెళ్లి తనిఖీ చేసే అధికారం లేదని ఈ విషయాన్ని గమనించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

వ్యక్తి దుర్మరణం

- నందిగామ మండలం రంగాపూర్ శివారులో ఘటన

నందిగామ: వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ గుర్తుతెలియని వ్యక్తి(45) దుర్మరణం చెందిన సంఘటన నందిగామ మండలం రంగాపూర్ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నందిగామ ఎస్‌ఐ గోపాల కృష్ణ తెలిపిన వివరాలు.. హెడ్ కానిస్టేబుల్ మహేశ్, పెట్రోలింగ్ కార్ డ్రైవర్ జయవర్ధన్ గురువారంవిధుల్లో భాగంగా పెట్రోలింగ్ చేస్తున్నారు. వీరు రంగాపూర్, చాకలిగుట్ట తండా గ్రామ పంచాయతీల శివారులోని 44వ నంబరు జాతీయ రహదారిపై నుంచి వెళ్తుండగా రోడ్డు పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో పడిపోయి ఉన్నాడు. వారు వెళ్లి పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపాలకృష్ణ తెలిపారు. మృతుడు బ్లూకలర్ టీషర్ట్, ఫార్మల్ పాయింట్ ధరించి ఉన్నాడని, ఎత్తు 5.2 ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నందిగామ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రభుత్వ స్థలంలో కాంపౌండ్ వాల్

- ఆమనగల్లు విఠాయిపల్లిలో ప్రైవేట్ వెంచర్ నిర్వాకం
- చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో గ్రామస్తుల ఫిర్యాదు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో ప్రభుత్వానికి అప్పగించిన భూమిని ఓ ప్రైవేట్ వెంచర్ యాజమాన్యం ఆక్రమించిందని ఆ గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ బల్‌రామ్‌కు వారు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీలో విలీనానికి ముందు గ్రామ పంచాయతీగా ఉన్న విఠాయిపల్లిలో సర్వే నంబర్లు 56, 57, 59-ఏలో ఓ ప్రైవేట్ వెంచర్ యాజమాన్యం వెంచర్ ఏర్పాటు చేసిందని అందులో పదిశాతం భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించిందని అన్నారు. తదనంతరం సదరు యాజమాన్యం ఆ పదిశాతం భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుందని తెలిపారు. ఈ విషయమై 2019 డిసెంబర్ 18న ఆమనగల్లు మున్సిపాలిటీలో ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఇదేవిషయమై 2023లో మరోసారి మున్సిపాలిటీలో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి ప్రభుత్వ భూమిలో వేసిన హద్దురాళ్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారని తెలిపారు. తాజాగా ఈనెల 20న తిరిగి సదరు యాజమాన్యం ప్రభుత్వ భూమి చుట్టూ కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతాలు, గ్రామస్తులు.. సాలయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, రమేశ్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్, నర్సింహ, పుల్యానాయక్, రవి, మురళి, రవీందర్, అనిల్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.



ఎస్‌ఐ బల్‌రామ్‌కు ఫిర్యాదు అందజేస్తున్న విఠాయిపల్లి గ్రామస్తులు

శభాష్.. వింధ్య

- ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ కైవసం
- ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో 983 మార్కులు సాధించిన విద్యార్థిని
- సన్మానించిన ఎమ్మెల్యే, గ్రామస్తులు

తలకొండపల్లి: ఇంటర్ ఫలితాల్లో తలకొండపల్లికి చెందిన నూకం వింధ్య అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకుంది. వివరాలు.. తలకొండపల్లికి చెందిన చంద్రకళ, శేఖర్ దంపతులు కూతురు వింధ్య 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేయగా.. అప్పట్లో పదోతరగతిలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించింది. తదుపరి కొందుర్గు మండలం పులుసుమామిడి కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో చేరింది. బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో వింధ్య మొత్తంగా 983/1000 మార్కులు సాధించి ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్‌ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, స్థానిక నాయకులు, గ్రామస్తులు వింధ్యను ఘనంగా సన్మానించారు. చదువులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో నర్సింగ్ కోర్సు పూర్తిచేసి నిరుపేదలకు వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని వింధ్య తెలిపింది.

ఉన్నతస్థాయికి ఎదగాలి..

కొందుర్గు: ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ఫస్ట్‌ర్యాంక్‌ను సాధించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన వింధ్యను గురువారం ఎమ్మెల్యే శంకర్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. వింధ్య ఉన్నత చదువులు చదివి మంచి స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. వింధ్యను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్‌లో ఆమెకు ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, పులుసుమామిడి మాజీ సర్పంచ్ షరీఫా బేగమ్, పాఠశాల ప్రిన్సిపాల్ సకీనా నిస్సీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు: వింధ్యకు మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వృద్ధురాలి మృతి కేసులో పురోగతి

- తెలిసినవారే హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసుల దర్యాప్తు!
- త్వరలో పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం

ఇబ్రహీంపట్నం రూరల్: ఈనెల 18న ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు సమాచారం. వివరాలు.. నాదర్‌గుల్‌లోని వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటున్న గడ్డం కళావతి(76) ఈనెల 18న తన గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. కళావతిది సాధారణ మృతి కాదు.. ఎవరో హత్యచేసి ఉంటారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కళావతి మృతికి ముందురోజు సాయంత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె ఉండే గదికి వచ్చి రాత్రి 10 గంటల వరకు ఆమెతోనే ఉన్నట్లు విచారణలో తేలినట్లు.. అతను ఎవరై ఉంటాడా అని సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. తెలిసిన వ్యక్తులే కళావతి వద్ద ఉన్న బంగారు గాజులను కాజేయడం కోసం ఆమెను హత్యచేసి ఉంటారేమో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేసుకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే పోలీసులు వెల్లడించనున్నట్లు తెలిసింది. కాగా వృద్ధురాలి మెడకు, చెవులకు ఉన్న బంగారం మా త్రం విడిచిపెట్టి చేతి గాజులు మాత్రమే దొంగిలించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే

గాయపడిన యువకుడిని ఆస్పత్రిలో చేర్పించిన కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడిని అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వయంగా తన కారులో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారం గ్రామానికి చెందిన మహేష్ గురువారం కడ్తాల్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గమనించి వెంటనే గాయపడిన మహేశ్‌ను తన కారులో దగ్గర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాద వివరాలను కుటుంబ సభ్యులకు, స్థానిక సీఐకి తెలిపడంతో పాటు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



యువకుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కంకుల మిషన్‌లో పడి..

- మహిళ దుర్మరణం
- జిల్లేడ్ చౌదరిగూడ తుమ్మలపల్లిలో ఘటన

కొందుర్గు: జొన్నకంకుల నూర్పిడి పనుల కోసం వెళ్లిన మహిళా కూలీ ప్రమాదవశాత్తు యంత్రంలో పడి మృతిచెందిన విషాదకర సంఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల ప్రకారం.. అయోధ్యాపూర్‌తండాకు చెందిన కెతావత్ చంద్యా (32)తో పాటు మరో ఇద్దరు మహిళా కూలీలు ఇదే తండాకు చెందిన కిషన్‌నాయక్.. గురువారం కంకుల నూర్పిడి మిషన్ వద్ద పనికి వెళ్లారు. ఈ క్రమంలో తుమ్మలపల్లికి చెందిన ఓ రైతు పొలం వద్ద చంద్యా కంకుల నూర్పిడి మిషన్ వద్ద జొన్న కంకులు శుద్ధి చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. కంకులతోపాటే రెండు రౌండ్లు మిషన్‌లో తిరగడంతో శరీరమంతా నుజ్జునుజ్జుగా మారి అక్కడికక్కడే చంద్యా మృతిచెందింది. గమనించిన కిషన్‌నాయక్ మిషన్ ఆఫ్‌చేసి జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు చంద్యాకు భర్త, ఇద్దరు కూమారులు ఉన్నారు.



మిషన్‌లో పడి మృతిచెందిన చంద్యా

మా షెడ్‌లోనే పార్కింగ్ చేయాలి

- జేపీదర్గా వద్ద కస్టమర్‌పై వ్యాపారుల జులుం
- కారు యజమాని, కుటుంబ సభ్యులపై దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు

కొత్తూరు: జేపీ దర్గాకు వెళ్తున్న వారి కారును అడ్డగించడంతో పాటు వారిపై దాడికి పాల్పడిన వ్యాపారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన రాజు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కారులో ఇన్ముల్‌నర్వలోని జేపీదర్గాకు బయలుదేరాడు. దర్గా ఆవరణలోకి చేరుకోగానే అక్కడి వ్యాపారులు షేక్ బురాన్, సయ్యద్ జమీన్ వారి కారును అడ్డగించి.. తమ షెడ్డులో వాహనాన్ని పార్కింగ్ చేయడంతో పాటు తమవద్ద పూలు కొనుగోలు చేయాలని వాదనకు దిగారు. ఈ క్రమంలో రాజు, వ్యాపారులకు మధ్యన వాగ్వాదం చోటుచేసుకోగా వ్యాపారులు.. రాజు, అతడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

- వడదెబ్బ తాళలేక చనిపోయినట్లు అనుమానం
- కేసు నమోదు

షాద్‌నగర్ రూరల్: వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. మొగిలిగిద్దకి చెందిన దివిటి సత్తయ్య(60) కుటుంబంతో కలిసి షాద్‌నగర్ పట్టణం ఈశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సంవత్సర కాలంగా ఆయనకు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఇంటినుంచి బయటకువెళ్లి అప్పుడప్పుడు ఇంటిదారి మర్చిపోయేవాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం రంగంపల్లి, మొగిలిగిద్ద శివారులో తిరిగిన సత్తయ్య సాయంత్రం సమయంలో రంగంపల్లి శివారులోని పరిగిరోడ్డు సమీపంలో మృతిచెంది పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వేసవికాలం కావడం, ఎండ తీవ్రత ఉండటంతో వడదెబ్బ తగిలి మృతిచెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మన్నెగూడ చోరీ కేసులో నిందితుడి అరెస్టు?

- భారీగా బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- త్వరలో వివరాలు వెల్లడించనున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: తాళంవేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతనివద్ద భారీగా బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ ఎస్‌ఎస్‌ఆర్‌నగర్ కాలనీలో ఈనెల 11వ తేదీన ఓ కుటుంబం ఇంటికి తాళంవేసి టెరిస్‌పై నిద్రిస్తుండగా నిందితుడు ఇంటితాళం పగులకొట్టి ఇంట్లోని బంగారం, నగదు దొంగిలించాడు. నిందితుడు అదేరోజు అదే కాలనీలో మరో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు సమాచారం. ఆయా కేసులను సీరియస్‌గా తీసుకున్న ఆదిబట్ల పోలీసులు.. ఆయా చోరీలు పాత నేరస్తుడి పనేనని గుర్తించి అతడిని అరెస్టు చేసి అతని వద్ద 15 నుంచి 20 తులాల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడు దొంగిలించిన బంగారం తీసుకెళ్లి కామారెడ్డి, పరిసర ప్రాంతాల్లో అతడి బంధువులకు ఇచ్చి బ్యాంకుల్లో కుదవపెట్టి వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు అతడికి సహకరించిన మరోవ్యక్తి ఆదిబట్ల పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఇంకా ఎక్కడెక్కడ దొపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డారో అని పోలీసులు ఆరాతీస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే ఆదిబట్ల పోలీసులు వెల్లడించనున్నట్లు సమాచారం.